దుప్పలవాడ పంచాయితీలో పొలం పిలుస్తుంది

విశాలాంధ్ర-సీలేరు : ఈనెల 31లోగా రాజుమా పంటకు భీమా చేయించుకోవాలని జీకేవీధి మండలం దుప్పలవాడ పంచాయితీ కుమ్మరపల్లి, బందవీధి గ్రామాలలో మంగళవారం మండల మండల వ్యవసాయాధికారి టి.మధుసూదనరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తుఫాను వాతావరణం ఉన్నందువల్ల రైతులు అప్రమతంగా ఉండాలన్నారు. రాజుమా వేసిన రైతులు పంటల బీమా చేయించుకోవాలన్నారు. పంట బీమా ఈనెల 31 వరకు అవకాశం ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు ఈ పంట కూడా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మన్మధరావు, సొన్ను పోతురాజు, పొట్టయ్య గంగరాజు, వాసు, పవన్, శ్రీదేవి, కృష్ణ రైతులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పీసా కమిటీ ఎన్నికలు నిర్వహించాలి : ఐటీడీఏ పీవో అభిషేక్

విశాలాంధ్ర-దుంబ్రిగూడ : పీసా కమిటీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని ఐటీడీఏ పీవో అభిషేక్ అన్నారు. మండలంలోని అరుకు పంచాయతీ కేంద్రంలోని కార్యాలయ ఆవరణలో పెసా దినోత్సవ ప్రత్యేక గ్రామసభ జరిగింది. ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో పాల్గొన్న పిఓ మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి తోడ్పాటునిచ్చే పెసా కమిటీల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఉపాధ్యక్షుడు, కార్యదర్శి పదవులకు ఎన్నికలను చేపట్టాలన్నారు. సకాలంలో ఓటరు జాబితను పొందు పరచాలన్నారు. ఓటర్ల జాబితలో తప్పులు తడకలు లేకుండా ప్రదర్శించాలన్నారు. పెసా కమిటీల ఎన్నికల్లో పార్టీలకతీతంగా నిర్వహించాలని ఆదేశించారు. పెసా గ్రామాల గిరిజనులు ప్రతిఒక్కరూ భాగస్వాములయ్యేలా చూడాలన్నారు. శాంతియుతంగా ఎన్నికలను నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఈకార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రజిని, జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, సర్పంచి శారద, పంచాయతీ కార్యదర్శి షేక్వల్లి, సచివాలయ సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలి : ఏవో ఆర్.ప్రశాంతి

విశాలాంధ్ర- దేవీపట్నం : తేలికపాటి నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలి అని వ్యసాయ అధికారిణి ఆర్. ప్రశాంతి రైతులకు పలు జాగ్రత్తలు తెలియజేసినారు వరి కోతలను రెండ మూడు రోజులు వాయిదా వేసుకోవాలి. కల్లాల్లో ఉన్న ధాన్యం తడిచిపోకుండా జాగ్రత్తలు తీసుకుని తర్పలతో కప్పి ఉంచుకోవాలి. కుప్పల పైన, పనలపై ఉన్న ధన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి మరియు ఎక్కడైనా ధాన్యం తడిస్తే మొలకెత్తకుండా 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారి చేయాలి. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం ద్వారా విక్రయించడానికి మీ విలేజ్ అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించాలని తెలియజేశారు.

జిల్లాలో విద్యారుణాలు మంజూరు చేయాలి : కలెక్టర్ దినేష్‌కుమార్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : జిల్లాలో ఉన్నత విద్య అవకాశాన్ని విద్యార్థులు పొందే విధంగా బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన జిల్లా కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, విద్యా రుణాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించి అవసరమైన వారికీ విద్యా రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఆర్థిక అక్షరాస్యత మరియు సైబర్ క్రైమ్ పై ప్రజలలో అవగాహన కోసం అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని బ్యాంకర్స్‌కి సూచించారు. రబీ పంట పై కొత్త రుణాలు మంజూరుచేయాలనీ తెలిపారు. వ్యవసాయ అనుసంధానమైన సంస్థ లకు రుణాలు మంజూరు చేయాలనీ తెలిపారు. పేదల జీవన ప్రమాణాల మెరుగుకు బ్యాంకులు సహకారం అందించాలని సూచించారు. పంటలు నష్టపోయిన రైతులకు, కొత్త రైతులను గుర్తించి బ్యాంకులు రుణాలు అందించడానికి ముందుకు రావాలని బ్యాంకర్లను కోరారు. వ్యవసాయ, ఉద్యాన శాఖలు రుణాలపై రైతులకు పూర్తీ స్థాయి అవగాహన కల్పించాలని, అంతర్ పంటలకు రెండు రుణాలు ఇచ్చే అవకాశాన్ని వారికి తెలియజేయాలని సూచిస్తూ, వరితో పాటు కాఫీ, మిరియాలకు కూడా రుణాలు ఇప్పించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పశుక్రాంతి పథకం క్రింద, పాలు ఇచ్చే పశువులు, పిగ్గరి, చేపల బోటులకు రుణాలు అందించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిఎంఇజిపి పథకాల కింద రుణాలు మంజూరు చేయాలన్నారు. మహిళ లను లక్షాదికారులుగా తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన లక్ పతి దీది పథకం కింద రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్లో మొదటి త్రైమాసికానికి 46 శాతం రుణాలు మంజూరు చేయడం పట్ల సంతృప్తి వ్యక్తపరిచిన కలెక్టర్ టర్మ్, ఇతర రుణాలు ఆశించిన స్థాయిలో లేనందున వాటిని తదుపరి త్రై మాసానికి విస్తృత పరచాలని ఆదేశించారు. ఈసమావేశంలో సంయుక్త కలెక్టర్ డా.ఎంజే అభిషేక్ గౌడ్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు హాజరయ్యారు.

మృతుని కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించాలి

గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి చిరంజీవి

విశాలాంధ్ర-చింతపల్లి : విద్యుద్ఘాతంతో మృతిచెందిన గిరిజనుడు వంతల చిట్టిబాబు కుటుంబానికి 20 లక్షల రూపాయలు నష్ట పరిహారం చెల్లించి ప్రభుత్వం ఆ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని బెన్నవరం పంచాయతీ గొచ్చపల్లి గ్రామానికి చెందిన గిరిజనుడు వంతల చిట్టిబాబు మిరియాలు కోయటానికి వినియోగించే నిచ్చెన విద్యుత్ వైర్లకు తగలడంతో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన విషయం తెలిసిందే. మృతి చెందిన చిట్టిబాబుకు భార్య లక్ష్మి, నలుగురు ఆడపిల్లలు (చిన్నవాళ్లు) ఉన్నారు. కుటుంబ యజమాని మృతి చెందడంతో ఆ కుటుంబం దిక్కులేని పరిస్థితి ఏర్పడింది. ఆ కుటుంబం నిరుపేద కుటుంబం కనుక ప్రభుత్వం ఆ కుటుంబానికి నష్టపరిహారంగా 20 లక్షలు రూపాయలు ఇచ్చి ఆదుకోవాలని గిరిజన సంఘం గా డిమాండ్ చేస్తున్నట్లు మండల ప్రధాన కార్యదర్శి చిరంజీవి డిమాండ్ చేశారు.

అదృశ్యమైన కొయ్యూరు గురుకుల విద్యార్థి మృతి... అధికారులు ఆరా

పాఠశాలను సందర్శించిన చింతపల్లి డీఎస్పీ

విశాలాంధ్ర-కొయ్యూరు : గత పది రోజుల క్రితం అదృశ్యమైన కొయ్యూరు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి చివరకు శవమై కనిపించాడు. కొయ్యూరు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న పాత పాడేరు గ్రామానికి చెందిన వంతల మనోజ్ తేజ ఈనెల 13 సాయంత్రం నుండి కనిపించడం లేదని పాఠశాల ప్రిన్సిపల్ కొయ్యూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం విద్యార్థి ఆచూకీకై చుట్టుపక్కల గ్రామాలలోను బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద గాలించినప్పటికి ప్రయోజనం లేకపోయింది. మనోజ్ తేజ అదృశ్యమైన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పలు పర్యాయాలు పాఠశాలకు వచ్చి తమ కుమారుడు ఏమైనట్లు అంటూ సిబ్బందిని నిలదీయటంతో విద్యార్థి ఆచూకీకై తీవ్రంగా గాలించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. పాఠశాల సమీపంలో చెరువులో సోమవారం సాయంత్రం గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కొయ్యూరు సీఐ వెంకటరమణ ఆదేశాలతో ఎస్సై కిషోర్ వర్మ సూచనమేర మంప ఎస్సై శంకరరావు తమ సిబ్బందితో సోమవారం రాత్రి చెరువు వద్దకు వెళ్లి మృతదేహాన్ని గుర్తించి వెలికి తీసే ప్రయత్నం చేశారు. ఎట్టకేలకు శ్రమించిన పోలీసులు ఎంపీపీ రమేష్, పాఠశాల సిబ్బంది సమక్షంలో మృతదేహాన్ని వెలికి తీసి ఉన్నతాధికారుల ఆదేశాలతో పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అదృశ్యమైన విద్యార్థి ఎక్కడున్నా తిరిగి వస్తాడని ఆశించిన ఉపాధ్యాయులు సహచర విద్యార్థులకు బాధను కన్న తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చి మనోజ్ తేజ విగతజీవిగా దర్శనం ఇవ్వటంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తుండగ, ఈ ఘటన పలువురిని కలచి వేస్తోంది. విద్యార్థి మనోజ్ తేజ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న చింతపల్లి డి.ఎస్.పి షేక్ షహాభాజ్ అహ్మద్ మంగళవారం పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. పాఠశాల సిబ్బంది విద్యార్థులను విచారించారు. విద్యార్థి అదృశ్యమైన నాటినుండి జరిగిన సంఘటనలపై ఆరా తీశారు. చెరువులో పడి మృతి చెందిన విద్యార్థి మృతదేహం తమ కుమారుడిదేనని తల్లిదండ్రులు అంగీకరించినట్లు డిఎస్పి తెలిపారు. ఈవిషయమై దర్యాప్తు చేపడుతున్నామని పూర్తి విషయాలు త్వరలోనే తెలియజేస్తామని ఆయన తెలిపారు. కాగా పాడేరు నుండి వచ్చిన క్లూస్ టీం సిబ్బంది సంఘటన ప్రదేశం చెరువు ప్రాంతంలో వివరాలను సేకరించారు. ఏది ఏమైనా విద్యార్థి మృతికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

గిరిజనులంతా పీసా గ్రామ కమిటీ సభలకు హాజరుకావాలి : ఐటీడీఏ పీవో

విశాలాంధ్ర-గంగవరం : ఏజెన్సీలోని పిసా గ్రామ కమిటీ సభలు గిరిజనలంతా కలిసికట్టుగా హాజరై ఉపయోగించుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం కోరారు. మంగళవారం గంగవరం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో ఏర్పాటుచేసిన పీసా దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయనముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో ప్రతి గ్రామంలో గిరిజనులందరూ కలిసికట్టుగా పీసా కమిటీ గ్రామ సభలలో పాల్గొని మీ మీ గ్రామాలకు సంబంధించిన తీర్మానాలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు.వి నేపథ్యంలో వివిధ రకాలైన అభివృద్ధి పనులు మంజూరు చేయవచ్చని ఆయన తెలిపారు. పీసా కమిటీ గ్రామ సభలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. పిసా గ్రామసభలు ఎప్పుడు జరిగిన మీ మీ గ్రామాలలో గిరిజనులందరూ తప్పకుండా పాల్గొవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఎల్పిఓ నర్సింగరావు,ఎంపీడీవో పి జి. రామకృష్ణ, సర్పంచ్ కె. అక్కమ్మ,వెలుగు ఏపీఎం షణ్ముఖేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కృష్ణ,మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, జనసేన మండల కమిటీ అధ్యక్షుడుకే సిద్దు,మాజీ ఎంపీటీసీ కోసు బుల్లియమ్మ,ఓటమి నాయకులు గవర్ రాజు, సారపు సత్యవేణి, గ్రామానికి చెందిన గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ఎంపిడిఓలకు షోకాజ్ నోటీసులు

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వ్యవసాయానుబంధ పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. 27567 మంది లబ్దిదారులను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్ లో నమోదు చేయలేదని ముగ్గురు ఎంపిడి ఓలకు సోకాజ్ నోటీసులు జారీ చేయాలని సిఓ ను ఆదేశించారు. చింతపల్లి, వి. ఆర్.పురం, హుకుంపేట ఎంపిడి ఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. వెబ్ సైట్లో లబ్దిదారుల వివరాలను నమోదు చేయకపోవడం, బ్యాంక ఖాతాలు ప్రారంభించక పోవడం వలన నగదు బదిలీ పథకాలను లబ్దిదారులు నష్టపోతారని ఎంపిడి ఓలపై ఆగ్రహం వ్యక్తం చేసారు. కలెక్టరేట్ నుండి డ్వామా, జిఎస్ డబ్ల్యు ఎస్, ఐసిడిఎస్, ఉపాధిహామీ, పశు సంవర్ధక శాఖ, గృహ నిర్మాణ శాఖ అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలు అమలుపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 64 వేల ఉపాధి హామీ జాబ్ కార్డుదారులకు వందరోజుల పని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించామని స్పష్టం చేసారు. ప్రతీ మండలంలోను 100 ఫారం పాండ్స్ నిర్మాణాలు ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. ఫారంపాండ్స్ వెడల్పు, లోతులను, ఎంత నీరు పడుతుందని అధికారులను అడిగి తెలుసు కున్నారు. ఉపాధి హామీ పనులపై ఎంపిడి ఓలు దృష్టి పెట్టాలన్నారు. లక్ష్యాలు సాధించలేని ఉపాధి హామీ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బరువు మరియు ఎత్తు తక్కువ ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. ఎత్తు తక్కువ ఉన్న చిన్నారులును పర్యవేక్షించి లోపానికి గల కారణాలు గుర్తించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాలలో ఇంకుడు గుంతలు ఏర్పాటకు తగు చెర్యలు తీస్కోవాలని ఐటిడిఏ పి. ఓలు ఆదేశించారు. ప్రతి ఎం పి డి ఒ క్షేత్ర పరిశీలనకు వెళ్ళినప్పుడు అక్కడ ఉన్న అంగన్వాడి కేంద్రాలను ఆకస్మిక తనిఖి చేసి తెరిచి వుందా లేదని, హాజరుపట్టి మరియు రికార్డును, వంటసాలను,టాయిలెట్స్ ఓపెన్ చేసి వుందా లేదని పరిశీలించాలని ఆదేశించారు. బాలికా వివాహాల నిర్మూలనకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. సచివాలయ మహిళా పోలీసులకు వివాహ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించకపోతే క్రమశిక్షణ చెర్యలు తీస్కుంటామని తెలిపారు. 982 మందికి ఆధార్ లింకింగ్ చేయాల్సి ఉందని ఆధార్ లింకింగ్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారులను ఆదేశించారు.

వినియోగదారులకు చట్టాలపై అవగాహన అవసరం : కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : జిల్లాలోని ప్రతీ ఒక్కరూ వినియోగదారులేనని, కావున మనందరికీ వినియోగదారుల చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలని ఉద్బోధించారు. మంగళవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జాతీయ వినియోగదారుల దినోత్సవ వేడుకలు పౌర సరఫరాల సంస్థ నేతృత్వంలో జరిగాయి. ఈ వేడుకల్లో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ వినియోగదారుల చట్టాలపై ప్రజల్లో అవగాహన మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పౌరుడు చట్టాలు గూర్చి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించే దిశగా వినియోగదారుల క్లబ్‌లను నిర్వహిస్తున్నామని, అవగాహన సదస్సులు నిర్వహించి వినియోగ దారుల హక్కులను తెలియజేస్తున్నట్లు చెప్పారు. పాలథిన్ కవర్లు, ప్లాస్టిక్ బాక్స్ ల్లోని తినుబండారాలు, రోడ్లపై బండ్ల వద్ద తయారయ్యే కలుషిత ఆహార పదార్థాలతో కేన్సర్ వంటి రోగాలు వచ్చే అవకాశం ఉందని కలెక్టర్ గుర్తుచేశారు. అందుకే స్వచ్ఛ సుందర పార్వతీపురం లో భాగంగా ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేదించనున్నట్లు చెప్పారు. సైబర్ క్రైం ఈమధ్య ఎక్కువగా ఉందని, ఈ-కామర్స్ మోసాలకు గురికాకుండా వినియోగదారులు జాగ్రత్త వహించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కళాశాల, పాఠశాల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి విజేత లకు కలెక్టర్ నగదుతో పాటు ధ్రువీకరణ పత్రాలను బహూకరించారు. మేలుకొలుపు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా ప్రజలను చైతన్యవంతులను చేయడంలో విశేష కృషిచేసిన పలు వాలంటరీ ఆర్గనైజేషన్లను కలెక్టర్ సత్కరించారు. తొలుత ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వివిధ శాఖల ప్రదర్శన స్టాళ్లను తిలకించారు. ఈ కార్యక్రమంలో కెఆర్ఆర్సి ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మ చంద్రారెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డా.టి.జగన్మోహన్‌రావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.శ్రీనివాసరావు,లీగల్ మెట్రాలజీ ఇన్ స్పెక్టర్ కె.రత్నరాజు, జిల్లా ఆహార తనిఖీ అధికారి ఏ.రామయ్య, జీఎస్టీ సహాయ కమిషనర్ డి.మోహన రావు, వినియోగదారులు, విద్యార్థులు, వాలంటరీ ఆర్గనైజేషన్లు తదితరులు పాల్గొన్నారు.

మినీగోకులంను ఎంపిడిఓ తనిఖీ

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని కాసాపేట గ్రామంలో రైతు రెడ్డి సత్యం నిర్మించిన గోకులంను ఎంపీడీవో పాండ్రంకి త్రివిక్రమరావు మంగళవారం తనిఖీ చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన గోశాలవద్ద ఏర్పాటుచేసిన పశువులు దాణాకు వాడే కుండి, వివరాలను తెలిపే సిమెంట్ పలకను కూడా పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా నిర్మాణం పూర్తి చేశారన్నారు. మండలంలో మొదట విడతగా మంజూరైన గోశాలల నిర్మాణాలు దాదాపు పూర్తయినట్లు తెలిపారు. ఆయనతోపాటు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకాలవర్షాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-సీతానగరం : గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల పట్ల ధాన్యం రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి అవినాష్, తహసిల్దార్ ఉమామహేశ్వరనాయుడు, ఎంపిడిఓ త్రివిక్రమరావులు పిలుపునిచ్చారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వారిని అప్రమత్తం చేస్తూ తగుసూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. వ్యవసాయ అధికారి అవినాష్ మాట్లాడుతూ అందరూ రైతులు వెంటనే వరిధాన్యంను నూర్చకుండా రెండు మూడు రోజులు వాయిదా వేసుకోవాలని సూచించారు. అలాగే రైతులు ధాన్యం బస్తాలలో నింపిన ధాన్యం ఉంటే వాటిని దగ్గరలో మిల్లులకు పంపించే ఏర్పాట్లు చేస్తామని తెలియచేశారు. అలాగే ఎక్కడైనా ధాన్యం తడిచిన తేమశాతం ఎక్కువగా ఉన్న వాటిని కూడా మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేస్తామని తెలియచేసారు.రైతులు ధాన్యం కప్పుకోవడానికి మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో 180 టార్పాలిన్‌లు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు వచ్చి తీసుకొని వెళ్లాలని తెలియచేసారు. ధాన్యాన్ని ట్రాక్టర్‌పై తీసుకొని వెళ్లినప్పుడు కూడా ఈ టార్పాలిన్ ఉపయోగించుకోవచ్చని తెలియచేసారు. రైతులకు గ్రామాల్లో ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తేవాలని ముగ్గురు అధికారులు తెలిపారు. గ్రామాల్లో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులు, రెవెన్యూ సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు.

వర్షాలపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-బలిజిపేట : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలుపట్ల రైతాంగం అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి శ్రావణ్ కుమార్ తెలిపారు. పలు గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. కోసిన పూర్తిగా ఆరని పనలను తుపాను వాతావరణ నేపథ్యంలో కుప్పలు వేసిలప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్పవేసుకోవడం వల్ల నష్టాన్ని నివారించుకోవచ్చన్నారు. కోత కోసి పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిచినట్లయితే గింజ మొలకెత్తకుండా ఉండడానికి 5 ఉప్పు ద్రావణాన్ని (ప్రతి లీటర్ నీటికి 50 గ్రాముల చొప్పున కల్లు ఉప్పు కలుపుకోవాలి) పనలపై పడేవిధంగా పిచికారీ చేయాలన్నారు. ఒకవేళ పొలంలో నీరు నిలిచి ఉన్నట్లయితే పనలను గట్లపైకి తెచ్చుకొని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకోవాలన్నారు. వర్షాలు తగ్గి ఎండ రాగానే పనలను తిరగేసి ఎండబెట్టి నూర్చుకోవాలన్నారు. కల్లాలమీద ఉన్న ధాన్యాన్ని వర్షానికి తడవకుండా భద్రపరుచుకోవాలని,నూర్చిన ధాన్యం 2-3 రోజులు ఎండ బెట్టడానికి వీలు కాకపోతే కుప్పలలో గింజ మొలకత్తడమేగాక రంగు మారి చెడు వాసన వస్తుందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నష్టాన్ని నివారించడానికి ఒక క్వింటాలు ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20కిలోల పొడి ఊక కలిపి దాన్యం పోగు పెట్టడంవల్ల మొలకత్తకుండా, చెడిపోకుండా నివారించుకోవచ్చన్నారు. ఎండ కాసిన తరువాత ధాన్యాన్ని ఎండబోసి, తూర్పార బట్టి నిలవచేసుకోవాలన్నారు. రంగు మారి, తడిచిన ధాన్యం పచ్చి బియ్యం కంటే ఉప్పుడు బియ్యంగా అమ్ముకోవడం వల్ల నష్టాన్ని కొంత వరకు తగ్గించుకోవచ్చన్నారు. మొక్కజొన్న పంటకు సంబంధించి పెరుగుదల దశలో ఉన్న మొక్కజొన్న పైరు అధిక వర్షాలు లేదా ముంపుకి గురైతే పొలములో ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలన్నారు. ఎకరానికి 50 కిలోలు యూరియ, 20 కిలోలు పోటాష్ ఎరువులును పై పాటుగా వేసుకోవాలన్నారు. ఆకు ఎండు తెగులు ఉధృతి ఎక్కువ అవడానికి అవకాశము ఉంది కావున దాని నివారణకు 1 మి.లీ. ప్రోపికోనజోల్‌ను ఒక లీటర్ నీటికి కలిపి చేను బాగా తడిచేటట్లు పిచికారి చేయాలన్నారు. వర్షాలు తగ్గిన 3-4 రోజుల తర్వాత వరసలు మధ్య భాగాన్ని గుంటకతో గాని, గొప్పు ద్వారా గాని సేద్యం చెయ్యాలన్నారు.

జోనల్ సెక్రటరీగా మీసాల మనోజ్ కుమార్

విశాలాంధ్ర-పార్వతీపురం : ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ జోనల్ సెక్రటరీగా పార్వతీపురం మన్యం జిల్లా అటవీ శాఖలోని సీతానగరం మండలంలోని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గా పనిచేస్తున్న మీసాల మనోజ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయనను ఎన్నుకోవడం జరిగింది. జోనల్ సెక్రెటరీగా ఎన్నికైన మనోజ్ కుమార్ ను జిల్లా అటవీ శాఖ అధికారి, సెక్షన్ అధికారులు, జూనియర్ ఫారెస్ట్ అధికారులు, అటవీశాఖ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీని సబ్ కలెక్టర్ ప్రారంభం

విశాలాంధ్ర-పార్వతీపురం: ఫిట్ ఇండియా సైక్లింగ్ ట్యూజ్ డే కార్యక్రమంలో భాగంగా ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ కలెక్టరేట్ ప్రాంగణంలో మంగళవారం జరిగింది. సెట్విజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సబ్ కలెక్టర్ మరియు ఐటీడీఏ ప్రోజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ ముఖ్య అతిధిగా పాల్గొని పచ్చ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం యువతతో కలిసి సైకిల్ తొక్కి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ సైకిళ్ల వినియోగంపై అవగాహన, ప్రాముఖ్యత ను తీసుకువచ్చేందుకు భారత ప్రభుత్వం కృషిచేస్తున్నట్లు చెప్పారు.ఒక ప్రోజెక్ట్ గా దేశవ్యాప్తంగా కొనసాగుతూ ఒకరిని ఫిట్‌గా చేయడమే దీని ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. అంతేకాకుండా వాయు కాలుష్యం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడంలో కూడా ఇలాంటి కార్యక్రమాలు దోహద పడతాయని అన్నారు. ఇంధనాన్ని పొదుపు చేస్తూ, మనమందరం ఆరోగ్యంగా ఉంచేలా ఫిట్ ఇండియా కార్యక్రమం చేస్తుందని ఆయన అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో సెట్విజ్ ముఖ్యకార్యనిర్వాహణాధికారి బి. రామ్ గోపాల్, పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు.

ప్రతిభ పాఠశాలలో లోపించిన క్రమశిక్షణ

40 మంది విద్యార్థులు చెప్పకుండా ఇళ్లకు వెళ్ళిపోయిన వైనం

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని జోగంపేట గ్రామంలో ప్రతిభ (స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్) పాఠశాల నుండి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల అనుమతి లేకుండా 40మంది విద్యార్థుల వరకు మూడు రోజుల క్రితం రాత్రిపూట వెళ్లిపోయారని విశ్వసనీయ సమాచారం. క్రిస్మస్ పండుగ దృష్ట్యా, పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎక్కువమంది సమ్మెలో ఉండటం వలన తరగతులు జరగడంలేదని ఉద్దేశంతో వారంతా పాఠశాల నుండి ఇళ్లకు వెళ్లిపోయారని తెలిసింది. గత 25 రోజులుగా ఇక్కడ పనిచేస్తున్న ఎక్కువ మంది విద్యార్థులు పార్వతీపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాలో పాల్గొంటున్న సంగతి తెలిసిందే. తరగతులు జరగకపోవడం, తమను పట్టించుకునే నాధుడు లేకపోవడం వలన వారంతా ఒకసారిగా అర్ధరాత్రి పూట వెళ్లారని తెలిసింది. దీనిపై ప్రిన్సిపాల్ మిగిలిన ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారని, సగం మంది విద్యార్థులు రాగా మిగిలిన సగం మంది విద్యార్థులు క్రిస్మస్ తర్వాత వస్తామని తెలియజేసినట్లు తెలిసింది. ఏదేమైనా ప్రతిభ కళాశాలలో గతంలో ఉండే క్రమశిక్షణ లోపించిందని స్పష్టంగా చెప్పవచ్చును. ఇంతమంది విద్యార్థులు అర్ధాంతరంగా వెళ్లిపోయిన సంఘటనపై ఉన్నతాధికారులు విచారణ చేసి తగుచర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

18 ఏళ్ళు నిండిన యువతపై దృష్టి సారించాలి

జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎం.వి.శేషగిరిబాబు

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో 18 ఏళ్ళు నిండిన యువతపై ప్రత్యేక దృష్టిని సారించి ఓటరుగా నమోదు చేయాలని రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ కమిషనర్ & ఇన్ స్పెక్టర్ జనరల్ మరియు జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎం.వి.శేషగిరి బాబు తెలిపారు. ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం-2025పై జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు, అన్ని మండలాల తహసీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ప్రత్యేక ఓటర్ల సవరణ,నమోదు ప్రక్రియ జరిగిందని, ఇందులో ఏమైనా అభ్యంతరాలు, తొలగింపులు ఉంటే తెలియజేయాలని రాజకీయ పక్షాలను కోరారు. ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం బాగా నిర్వహించిందని, ప్రత్యేక శిబిరాల్లో ప్రజాప్రతినిధులు కూడా భాగస్వామ్యం అయ్యారని, ఎటువంటి సమస్యలు జిల్లాలో లేవని రాజకీయ పక్షాలు తెలియజేయడంతో ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రత్యేక ఓటర్ల సవరణ వచ్చే ఏడాదిలో నాలుగు సార్లు జరగనుందని, కొత్తగా ఓటరు నమోదు కావాల్సిన వారు, తొలగింపులు, మార్పులు, చేర్పులు చేసుకునే సౌలభ్యం ఉంటుందని సూచించారు. ముఖ్యంగా 18ఏళ్ళు నిండిన యువత ఓటరుగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో 18ఏళ్ళు నిండిన యువతను ఓటరుగా నమోదుచేసేందుకు ప్రతీ కళాశాలల్లో ప్రత్యేక శిబిరాలను జిల్లావ్యాప్తంగా నిర్వహించి నమోదు చేయడం జరిగిందని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్‌కు వివరించారు. బీఎల్ఓల ద్వారా స్వీప్ కార్యక్రమం, ప్రత్యేక శిబిరాలను నిర్వహించి ఓటర్ల నమోదు, సవరణలు చేసినట్లు వివరించారు. రాజకీయ పక్షాలతో ఎప్పటికపుడు సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహనతోపాటు హెల్మెట్ ధరించాలని అవగాహన

విశాలాంధ్ర-సీతానగరం : మండల కేంద్రంలోని హనుమాన్ కూడలివద్ద వర్షం పడుతున్న లెక్కచేయక సీతానగరం ఎస్సై రాజేష్, ఏఎస్ఐలు శ్రీనివాసరావు లక్ష్మణరావుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలతో పాటు గతంలో విధించిన అపరాధ రుసుము వసూలు కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలమేరకు కార్యక్రమాలను ప్రతీరోజు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సైబర్ నేరాలపై కూడా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ లేకపోతే అపరాదరసం వేయడం జరుగుతుందన్నారు. వాహనదారులు రోడ్డు నియమనిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఆరుబయట మద్యం తాగే వారిపై కూడా తగు కేసులను నమోదుచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతో సైబర్ నేరాలను అరికట్టేందుకు కృషి : జిల్లా ఎస్పీ

పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి

విశాలాంధ్ర-పార్వతీపురం : అక్షరాస్యత కన్నా ఆర్థిక అక్షరాస్యత లోపం వల్ల సైబర్ నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయని,సైబర్ నేరాల మీద ప్రజలకు చైతన్యం కల్పించే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహణతో అరికట్టేందుకు కృషి చేస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి తెలిపారు. మంగళవారం నాడు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ శ్రీ ఎస్. వి. మాధవ్ రెడ్డి, సబ్ డివిజన్ ఏఎస్పీ అంకిత్ సురానలు యూనియన్ బ్యాంక్ అధికారులతో కలిసి కాన్ఫరెన్స్ హాల్లో సైబర్ నేరాల మీద గోడపత్రికలను విడుదల చేశారు. సైబర్ నేరాలపై ప్రజల్లో చైతన్యం తేవడానికి రూపొందించిన బ్యానర్ లను ఆవిష్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలు నుంచి మనం ప్రజలను ఎలా కాపాడాలనే సదుద్దేశంతో ఈకార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. నేరాలన్నీ జరగడానికి ఎక్కువ అవకాశం వుండే ప్లాట్ ఫారం బ్యాంకింగ్ సిస్టంఅని, బ్యాంకింగ్ సిస్టం ఎప్పుడైతే ఆన్లైన్ సేవలు ప్రారంభించిందో ఈ ఆన్లైన్ ట్రాన్సాక్షన్స్ నుంచి పుట్టినదే ఈ సైబర్ నేరమని తెలియజేసారు. పోలీస్ శాఖ ప్రజల యొక్క డబ్బు ఎక్కడైతే దాచుకున్నారో ఆబ్యాంకుల యొక్క సహకారం కూడా ఉండాలని, అందుకొరకు గడిచిన కాలంలో జిల్లాలోని అందరూ బ్యాంకు అధికారులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సైబర్ నేరాలని ఈజిల్లాలో ఏవిధంగా అరికట్టాలి,ప్రజలను ఏవిధంగా అప్రమత్తం చేయాలి, వారియొక్క డబ్బును బ్యాంకుల్లో ఏవిధంగా భద్రతగా ఉండేటట్టు చూడాలనే మేథోమధనం బ్యాంకర్స్ తో చేయడం జరిగిందన్నారు. దానిలో భాగంగా యూనియన్ బ్యాంక్ వారు ముందుగా మా వద్దకు వచ్చి ప్రజలకు, కస్టమర్లకు సైబర్ నేరాలపట్ల అవగాహన కల్పించాలని సదుద్దేశంతో మీకు మేము సహాయపడతామని ముందుకురావడం హర్షనీయమన్నారు. మీవంతు కృషిగా ప్రజలకు, మీకస్టమర్లకు అవగాహన కల్పించే బాధ్యత ఎంతైనా ఉందని తెలియజేశారు. అవగాహన కార్యక్రమాలు బ్యాంకర్స్, పోలీస్ శాఖ సమన్వయంతో నిర్వహించాలని మీకస్టమర్ల యొక్క అనుమానిత ట్రాన్సాక్షన్స్ వారి యొక్క నగదును కాపాడే ప్రయత్నం చేయాలని, సైబర్ నేరాల మీద అవగాహన కొరకు రూపొందించిన బ్యానర్లను ప్రజలకు అవగాహన ఉండేలా బ్యాంకుల్లో, ఏటిఎం కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా సిఎస్ఆర్ యాక్టివిటీలో భాగంగా యూనియన్ బ్యాంక్ తరపునుండి సైబర్ సెల్ కొరకు చైర్స్ మరియు టేబుల్సు ఇవ్వడంపట్ల వారిని అభినందిస్తూ,ధన్యవాదాలు తెలియజేసారు. యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ గారు మాట్లాడుతూ ఇంతకుముందు చూసుకుంటే మనం ఎక్కువగా అక్షరాస్యత మీద దృష్టి సారించేవారమని, కానీఇప్పుడు అక్షరాస్యత ఉన్నప్పటికీ కూడా ఆర్థిక అక్షరాస్యత లోపంవల్ల సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రస్తుత సమాజంలో అక్షరాస్యులు ఉన్న కూడా ఆర్థిక అక్షరాస్యత లోపం వల్ల ఏదో ఒక సైబర్ నేరాల్లో చిక్కుకోవడం, నగదును పోగొట్టుకోవడం జరుగుతుందని తెలిపారు .అటువంటి వాటి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం కొరకు

బ్యాంకుల ద్వారా కూడా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని, అన్ని గ్రామాలలోనూ ప్రజలకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించుట కొరకు కరపత్రాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా స్కూల్లోనూ, కళాశాలలోనూ చదువుకున్న విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత గురించి అవగాహన కల్పించడం జరుగుతుందని తెలియజేశారు. ఈసందర్భంగా యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ , బ్రాంచ్ మేనేజర్లు సొసైటీ నుంచి మనం తీసుకోవడమే కాకుండా సొసైటీకి కొంచెం ఇవ్వాలని ఉద్దేశంతో సి ఎస్ ఆర్ యాక్టివిటీలో భాగంగా యూనియన్ బ్యాంక్ తరఫునుండి సైబర్ సెల్ కొరకు చైర్స్ మరియు టేబుల్స్ను వితరణ చేశామన్నారు. ఈకార్యక్రమంలో ఎస్పీతో పాటు పార్వతీపురం ఏఎస్పీ అంకిత సురాన,యూనియన్ బ్యాంకు రీజినల్ మేనేజర్ వెంకట్ తిలక్, పార్వతీపురం బ్రాంచ్ మేనేజర్ సత్యన్నారాయణ,సోషల్ మీడియా,సైబర్ సెల్ సిఐ శ్రీనివాస రావు,ఎస్బీ సిఐ రంగనాథం, డిసీఅర్బీ సిఐ ఎర్రంనాయుడు, పార్వతీపురం టౌన్ సిఐ మురళీధర్ ,సిసిఎస్ సిఐ అప్పారావు, ఆర్ఐలు నాయుడు,శ్రీరాములు పాల్గొన్నారు.

పీసా చట్టం పకడ్బందీ అమలుతో గిరి ప్రాంత పరిరక్షణ

విశాలాంధ్ర-అనంతగిరి : పీసా చట్టం పకడ్బందీగా అమలు చేయడం ద్వారానే గిరిజన ప్రాంతాలను పరిరక్షణ సాధ్యమవుతుంది. పంచాయతీల (షెడ్యూల్డ్ ప్రాంతాలకు పొడిగింపు) చట్టం, 1996 పిసా గిరిజన వర్గాల సాధికారత కోసం ఒక ముఖ్యమైన మరియు కీలకమైన చట్టంమని దీనిని భారతదేశంలో డిసెంబర్ 24, 1996 నుండి అమలులోకి వచ్చిన తీసుకుని వచ్చారాని, భారతీయ ఆదివాసుల సమాఖ్య సభ్యురాలు గడుతూరి రామలక్ష్మి తెలిపారు. పత్రికలతో మాట్లాడుతూ పీసా చట్టం పంచాయతీలు షెడ్యూల్డ్ ప్రాంతాలకు పొడిగింపు చట్టం, 1996 ప్రధానంగా భారతదేశంలోని షెడ్యూల్డ్ ప్రాంతాలకు పంచాయతీ రాజ్ వ్యవస్థ యొక్క నిబంధనలను విస్తరించడానికి ఉపయోగించబడుతుంది, ముఖ్యంగా గిరిజన సమూహాలకు వారి భూమి, వనరులు, సంప్రదాయాలపై అధిక స్వయంప్రతిపత్తి మరియు నియంత్రణను మంజూరు చేస్తుంది. వారి సాంస్కృతిక గుర్తింపు, ఆచారాలను కాపాడుతూ స్థానిక సమస్యలపై నిర్ణయాలు తీసుకునేలా గ్రామసభకు అధికారం ఇస్తుంది. పంచాయతీల (షెడ్యూల్డ్ ప్రాంతాలకు పొడిగింపు) చట్టం, 1996 పిసా చట్టం సాధికారత కోసం ఒక ముఖ్యమైన మరియు కీలకమైన చట్టం. దీనిని భారతదేశంలో డిసెంబర్ 24, 1996 నుండి అమలులోకి తీసుకుని వచ్చారు. పంచాయతీల (షెడ్యూల్డ్ ప్రాంతాలకు పొడిగింపు) చట్టం, 1996పిసా చట్టంని కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అనేక విధాలుగా ఉల్లంఘిస్తున్నాయి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్య ప్రదేశ్, చత్తీస్ గఢ్, గుజరాత్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ మరియు మహారాష్ట్ర రాష్ట్రాలలో అమలు అవుతోంది. ఒడిశా, ఝార్ఖండ్ రాష్ట్రాలలో మిగిలిన రాష్ట్రలు పెసా నిబంధనలను రూపొందించాయి కానీ వాటిని నోటిపై చేయలేదు. పెసా నిబంధనలు కొన్ని ఈ విధంగా ఉన్నాయి. కొన్ని రాష్ట్రాలు ప్రత్యామ్నాయ రక్షణ నిబంధనలను అందించకుండా పంచాయతీలను మున్సిపాలిటీ లుగా అప్‌గ్రేడ్ చేశాయి. ఇది చట్టపరమైన సవాళ్లకు దారితీసింది, పీసా చట్టం పరిధి నుండి ప్రాంతాలను తొలగిస్తున్నాయి. కొత్తగా ప్రాజెక్టులు నిర్మాణం కోసం రాష్ట్రాలలో భూసేకరణ చేపట్టినప్పుడు అధికారులు భూమిని సేకరించే ముందు గ్రామసభ లేదా మండల ప్రజా పరిషత్‌ను సంప్రదించడం లేదు. ఇది పెసా ఏక్ట్ నియమ నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుంది. కొన్ని రాష్ట్ర చట్టాలు గిరిజనుల సంప్రదాయ చట్టాలను విస్మరిస్తున్నాయి. గుజరాత్ రాష్ట్రంలో పీసాతో సంబంధం లేకుండా సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాజెక్ట్ కోసం 121 గ్రామాలు నోటిపై చేయబడ్డాయి. ఇది పీసా ఏక్ట్ ఉల్లంఘనే. అదేవిధంగా ఒడిశా, చత్తీస్ గఢ్, ఝార్ఖండ్ తదితర రాష్ట్రాలలో ఖనిజ సంపదను వెలికితీయడానికి తవ్వకాలు జరపడానికి, నదులపై ప్రాజెక్టులు కట్టేటప్పుడు పిసా చట్టం నియమ నిబంధనలు అనుసరించి గ్రామసభలు జరిపి ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవలసి ఉన్నప్పటికీ దానిని సరిగ్గా పాటించడం లేదు. గిరిజన జనాభా అధికంగా గల రాష్ట్రాలు త్వరగా పెసా ఏక్ట్ నిబంధనలను రూపొందించి వాటిని పటిష్టంగా అమలుచేయాలి. దీనిలో పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖల పాత్రలను స్పష్టంగా నిర్వచించాలి. పిసా చట్టంపై

అవగాహన పెంచేందుకు గిరిజనులకు అవగాహన కల్పించాలి. అటవీ హక్కుల చట్టం (2006) మరియు భూసేకరణ, పునరావాసం మరియు పునరావాస చట్టం (2013)లో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు (2013) యొక్క నిబంధనలను పీసా చట్టంతో అనుసంధానించాలి. స్వయం ప్రతిపత్తితో తమ పనులు చూసుకునే అధికారం గ్రామసభలకు ఇవ్వాలి. రాష్ట్ర శాఖల ప్రస్తుత క్రియాత్మక సంస్థలు గ్రామసభకు జవాబుదారీగా ఉండాలి. అటవీ అధికారులతో సంప్రదించి మైనర్ ఫారెస్ట్ ప్రొడ్యూస్ ఎంఈపి వినియోగం లేదా గిరిజనులు దోపిడీ గురికాకుండా ఉండటం కోసం గ్రామ సభ కార్యాచరణ ప్రణాళికను రూపొందించ వచ్చు. ఎంజిపి కొనుగోలు లేదా మారకపు ధరలకు కనీస ధరలను నిర్ణయించడంలో గ్రామసభ ప్రధాన పాత్ర పోషించాలి. ఔ విధమైన చర్యలు ద్వారా పంచాయతీల (షెడ్యూల్డ్ ప్రాంతాలకు పొడిగింపు) చట్టం, 1996 పిసా చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థవంతంగా అమలు చేయవచ్చని, భారతీయ ఆదివాసుల ఆంధ్రప్రదేశ్ సమైక్య, సభ్యురాలు గడుతూరి రామలక్ష్మి తెలిపారు.

ప్రజల భాగస్వామ్యం లేకుండా అవగాహన సదస్సులా..!

- పంచాయితీ అధికారుల నిర్లక్ష్య ధోరణితో ప్రజాధనం దుర్వినియోగం
- గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ధనుంజయ్

విశాలాంధ్ర-చింతపల్లి : పీసా కమిటీ పరిధిలోని గ్రామాల్లో ఉంటున్న ప్రజల భాగస్వామ్యం లేకుండా అవగాహన సదస్సులా..! అని గిరిజన సంఘం అల్లూరి జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని షెడ్యూల్ ప్రాంతంలో 244 పంచాయితీల్లో 1026 గ్రామ సభలకు పీసా గ్రామసభల కమిటీల ఎన్నికలకు సంబంధించి పిసా దినోత్సవ వేడుకలు పేరుతో మంగళవారం పీసా చట్టం దాని ప్రాధాన్యత, హక్కులపై అవగాహన సదస్సులు అధికారికంగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈసందర్భంగా తాజంగి పంచాయితీ సచివాలయంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో హాజరైన ధనుంజయ్ మాట్లాడుతూ తాము ఇప్పటికే గత వైసిపి ప్రభుత్వం గిరిజన చట్టాల కోసం పట్టించుకోలేదని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అయినా పీసా గ్రామసభలు ఏర్పాటు చేయాలని, గ్రామ సభలకు ఉన్న అధికారాలను అమలు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసనలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ప్రతి సదస్సుకు పదివేల రూపాయలు ఇస్తామని పీసా గ్రామసభల ప్రాధాన్యతపై గ్రామసభల పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం అయినప్పటికీ సంబంధిత ప్రజల భాగస్వామ్యం లేకుండా అవగాహన సదస్సులు ఎలా నిర్వహిస్తారని ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లను, సచివాలయ ఉద్యోగస్తులను ఇంకొంతమంది కూటమి పార్టీల వ్యక్తులతోనే సదస్సు జరిపి చేతులు దులిపేసుకుంటారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దానివల్ల ప్రజలకు అవగాహన ఎలా కలుగుతుందని మండిపడ్డారు. ఈపేరిట ప్రజాధనం దుర్వినియోగం చేయడానికేనా ఈ సదస్సులు అని ప్రశ్నించారు. ప్రజలకు సమాచారం ఇవ్వకుండా అట్టహాసంగా అవగాహన సదస్సులు ఎందుకు నిర్వహిస్తున్నారని పంచాయితీ కార్యదర్శి సర్పంచులను ఆయన నిలదీశారు. తమ ప్రాంత హక్కుల్ని కాపాడుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, నిర్వహణ అధికారులపై ఉన్నదని దాన్ని విస్మరించి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని ప్రభుత్వము అధికారుల తీరును ఆయన తప్పుపట్టారు. పంచాయితీ కార్యదర్శి లేదా ఎవరి నిర్లక్ష్యం వల్ల ప్రజలను భాగస్వామ్యం చేయలేదని నిలదీశారు. ఇప్పటికే ఏదో రాజకీయాలు చేస్తున్న కొద్దిమందికే తప్ప గిరిజన ప్రాంత హక్కులు చట్టాలపై మిగతా వారికి అవగాహన లేదని దానివల్ల ఇప్పటికే తీవ్రమైన నష్టం

జరిగిపోయిందని, ఇకనైనా కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకొని గిరిజన ప్రాంత హక్కులు, చట్టాలను శత శాతం అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఏర్పాటు చేసిన పీసా కమిటీలు బాధ్యతలు సక్రమమైన పద్ధతిలో నిర్వహించలేదని దానివల్ల చాలా అభివృద్ధి కార్యక్రమాలకు షెడ్యూల్ ప్రాంతంలో కమిటీలో ఉన్నవారు ఉపయోగపడలేదని, అందుకోసం కూటమి ప్రభుత్వం సరైన పద్ధతిలో పిసా చట్టం కమిటీలు పనిచేసేలా, పీసా చట్టానికి ధిక్కరించి ఏ సంబంధిత కార్యక్రమాలు జరగకుండా చట్టం అమలుపరిచేలా కమిటీలకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ అనూషదేవి సహా ఆ పంచాయతీ సర్పంచ్ మహేశ్వరి, ఎన్డీఏ కూటమి నాయకులు లక్ష్మణ్, పురుషోత్తం, ఉగ్రంగి లక్ష్మణరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రీమల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు, సందేశం మానవాళికి ఆదర్శప్రాయం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : క్రీస్తు బోధనలు, సందేశం యావత్ ప్రపంచానికి ఆదర్శప్రాయమని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక లయన్స్ కళ్యాణ మండపంలో జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు(హైటీ) ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొని క్రిస్మస్ కేకును కట్‌చేసి పాస్టర్లకు తినిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని క్రైస్తవులందరికి ముందస్తు క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ చాలా ప్రత్యేకమైందని, చల్లని, ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించుకునే పండుగని అన్నారు. ప్రతీ ఏడాది క్రిస్మస్ రోజున స్థానికంగా ఉండే చర్చికి హాజరై ప్రార్థన చేస్తానని కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. మనం ఎప్పటికి మంచి చేస్తే మరింత మంచి జరుగుతుందని క్రీస్తు బోధనలు తెలిపాయని, తోటివారిని ప్రేమించాలనే క్రీస్తు సందేశం యావత్ ప్రపంచానికే ఆదర్శమని చెప్పారు. ప్రపంచంలో ఎక్కువ మంది విశ్వసించేది క్రిస్టియన్లేనని, అందరు ఆచరించదగిన విధంగా ఈపండుగను జరుపుకుంటారని కలెక్టర్ తెలిపారు. క్రీస్తు మార్గంలో అందరూ నడవాలని, జిల్లా సర్వతోముఖాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. క్రిస్టియన్ల సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించి తగిన చర్యలు చేపడతామని అన్నారు. తొలుత కొవ్వొత్తులను వెలిగించి ప్రార్థనలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ప్రతినిధి రాజు, డీఐపీఆర్ఓ ఎల్.రమేష్, సీపీఓ పి వీర్రాజు, గ్రామ సచివాలయాల నోడల్ అధికారి బి.రామ్‌గోపాల్, పాస్టర్ విజయకుమార్, బ్రదర్ ఆనంద్, క్రైస్తవ మత పెద్దలు ఎం.ఎ.నాయుడు, మనోహర్‌భాయి, సదానందం, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం : క్రిస్మస్ పండుగ సందర్భంగా బుధవారం పార్వతీపురంలోని తనస్వగృహం వద్ద క్రిస్మస్ విందును ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే అలజింగి జోగారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వైఎస్ఆర్సిపి నాయకులు ప్రజాప్రతి నిధులు కార్యకర్తలు అభిమానులు హాజరుకావాలని కోరారు.

పార్వతీపురం : పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్రకు

నియోజకవర్గ జనసేన నాయకులు, సైనికులు, వీరమహిళలు, అభిమానులు పెద్దఎత్తున విచ్చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసారు. ఆయనకు వారంతా పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. వారికి ఎమ్మెల్యే కూడా కృతజ్ఞతలు తెలిపారు.

బలిజిపేట : క్రిస్మస్ పండుగ సందర్భంగా బుధవారంనాడు పార్వతీపురంలోని తన స్వగృహం వద్ద క్రిస్మస్ విందును ఏర్పాటు

చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే అలజింగి జోగారావు తెలిపారు. ఈకార్యక్రమానికి నియోజకవర్గంలోని వైఎస్ఆర్సిపి నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు అభిమానులు హాజరు కావాలని కోరారు.

సీతానగరం : మండలంలోని గెడ్డలుప్పి కూడలిలో ఉన్న కృషి స్కూల్లో మంగళవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో క్రిస్మస్ ట్రీ ఏర్పాటు చేశారు. కరస్పాండెంట్ ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు క్రిస్టియన్ పిల్లలను ప్రత్యేకంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలియజేసి స్వీట్లు పంచిపెట్టారు. వారితోపాటు అందరి విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. జీసస్ గురించి శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్నీమతాలు ఒకటేనని, మనమంతా ఒకటేనని, అందరూ కలిసి ఐక్యతగాఉండాలని చెప్పారు. ఈ సందర్భంగా పిల్లలు కూడా క్రిస్మస్ పండుగ గూర్చిమాట్లాడడమే గాక జీసస్ పాటలు పాడారు.

జియ్యమ్మవలస : మండలంలోని చినమేరంగి గ్రామంలో ఉన్న పునీత జోజప్ప క్రీస్తు దేవాలయంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా భక్తి పారవశ్యంతో ప్రారంభమయ్యాయి. దీనికై ఆర్సిఎం చర్చ్ (పునీత జోజప్ప దేవాలయ విచారణ) అంగరంగ వైభవంగా సుందరంగా కన్నుల పండుగగా ముస్తాబయింది. కిషోర్ రాజు, క్రీస్తు పుట్టిన ఘడియలలో అర్ధరాత్రి దివ్య పూజ బలి దివ్య సత్ప్రసాద సంఘాలు చేసి క్రైస్తవులను ఆశీర్వదించారు. 25వ రాత్రి శ్రీకాకుళ మేత్రాసన బిసప్ పల్లోటియన్ సంస్థ రీజనల్ రిక్టార్ బోయెల్లా బాలాజీ బోయల బాలాజీ ఆధ్వర్యంలో గురువులు మత కన్యలు దివ్య పూజా బలి అందించనున్నారని విచారణ కర్తలు కిశోర్రాజు తెలిపారు.

వై.రామవరం : వై.రామవరం గ్రామంలో స్థానిక లెవెన్స్ ఇవాన్జికల్ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిపారు. చర్చి వ్యవస్థాపకులు బొంకు జార్జి కుటుంబరావు ఆధ్వర్యంలో పలువురు రెవరెండంలు, ఫాస్టర్లు బైబిల్ వ్యాక్యాలను బోధించారు.కార్యక్రమం లో రిటైర్డు టీచర్ నక్కా నహెూమ్, అధికసంఖ్యలో క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో రెగ్యులర్ వైద్యులను నియమించాలి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రం (జగన్నాథపురం)లో గత రెండేళ్లుగా పూర్తి స్థాయిలో వైద్యులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సిపిఎం నాయకులు గొర్లి వెంకటరమణ, పాకల సన్యాసిరావు, బి వి రమణ, బంకురు సూరిబాబు విమర్శించారు. మంగళవారం జగన్నాథపురం లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండేళ్లుగా ఈ జగన్నాథపురం పట్టణ ఆరోగ్య కేంద్రంలో రెగ్యులర్ వైద్యులు లేరని, వైద్యులు చేయాల్సిన వైద్యాన్ని వైద్యంపై పూర్తిస్థాయిలో అవగాహన లేని సిబ్బంది చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇది అత్యంత ప్రమాదకరమైన దుస్థితి అని హెచ్చరించారు. పార్వతీపురంలో అత్యంత వెనుకబడిన ప్రాంతంగా గుర్తించబడిన జగన్నాథపురం ప్రాంత ప్రజలకు ఎంతో అవసరమైన ఈ ఆసుపత్రి విషయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. గత నెలలో ఈ ఆసుపత్రిని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సందర్శించారని అయినప్పటికీ అక్కడ వైద్యులను నియమించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ప్రజలు వివరించినట్లు సిపిఎం నాయకులు తెలిపారు. ప్రస్తుతం వారంలో సోమ, మంగళ, బుధవారాలకు ఒక వైద్యాధికారిని, గురు, శుక్ర, శనివారాలకు ఒక వైద్యాధికారిణి తాత్కాలిక ప్రాతిపదికన నియమించినప్పటికీ పూర్తిస్థాయిలో వైద్యం ప్రజలకు అందుబాటులోకి రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి అర్బన్ హెల్త్ సెంటర్లో పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాలని డిమాండ్ చేశారు, లేనియెడల సిపిఎం ఆధ్వర్యంలో ఈ ప్రాంత ప్రజలతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి రాజశేఖర్, జీ.తులసి తదితరులు పాల్గొన్నారు.

వరి పంటలపై అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-చింతపల్లి : పొలం పిలుస్తుంది కార్యక్రమం ద్వారా వరి పంట కోత అనంతరం సాగు చేసే పంటలపై మండలంలోని బొర్రి, కుదుపుసింగి గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి బి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వరి పంట కోత అనంతరం సాగుచేసే పంటలపై గిరి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు వరి పంట అనంతరం తమ పొలంను ఖాళీగా విడిచి పెట్టకుండా నీటి సదుపాయం ఉంటే వరి, మొక్కజొన్న, వేరుశనగ, కూరగాయ పంటలను వర్షాధారం క్రింద పెసర, మినుము, ఉలవలు వంటి విత్తనాలు చల్లుకోవాలని సూచించారు. వ్యవసాయ భూములను ఖాళీగా విడిచి పెట్టడం వలన భూసారం దెబ్బతింటుందని తెలిపారు. పెసర, మినుము వంటి లెగ్యూమ్ జాతి పంటలను పండించడం వలన వాటి వేరుల్లో ఉన్న రైజోబియం బాక్టీరియా గాలిలో ఉన్న నత్రజనిని నేలలో స్థిరీకరించడం వలన నేలలో నత్రజని లభ్యత పెరిగి తరువాత వేసిన పంటలకు ఉపకరిస్తుందని, తద్వారా భూసారం పెరుగుతుందని తెలిపారు. అదేక్రమంలో ఫార్మర్ రిజిస్ట్రీ లో రైతులు తప్పనిసరిగా నమోదై 16 అంకెల ప్రత్యేక గుర్తింపు పొందు విధానంపై అవగాహన కల్పించారు. ఈనెల 31వ తేదీ లోపు ప్రధాని మంత్రి ఫసల్ భీమా యోజన, రాజ్మా, వరి పంటలకు ఇన్సూరెన్స్ కట్టుకోవాలని ఈ సందర్భంగా రైతులకు ఆయన సూచించారు.

పీసా చట్టంపై ప్రజలకు అవగాహన

విశాలాంధ్ర-సీతంపేట : మండల కేంద్రంలో మంగళవారం గ్రామ సచివాలయంలో పెసా చట్టం 24 డిసెంబర్ 1996న సాంప్రదాయ గ్రామ సభల ద్వారా షెడ్యూల్డ్ ప్రాంతాలు అని పిలువబడే గిరిజన ప్రాంతాలలో నివసించే ప్రజలకు స్వయం పాలనను నిర్ధారించడానికి రూపొందించ బడింది ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని ఎంపీడీవో గీతాంజలి తెలిపారు. షెడ్యూల్డ్ ప్రాంతాలకు పంచాయితీ పొడిగింపు చట్టం అమలును పటిష్టం చేసేందుకు, పంచాయత్ రాజ్ మంత్రిత్వ శాఖ డిసెంబర్ 24న పీసా దినోత్సవంగా ప్రకటించింది. పీసా దినోత్సవంలో భాగంగా పెసా చట్టంపై అవగాహన పెంపొందించడం, గ్రామ సభలను బలోపేతం చేయడం, షెడ్యూల్ చేసిన ప్రాంతాల్లో గ్రామ పంచాయతీల పనితీరును మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన పాలన కోసం వాటాదారులకు సామర్థ్యాన్ని పెంపొందించడం జరిగింది. సీతంపేట మండలంలోని 41 షెడ్యూల్డ్ గ్రామ పంచాయతీలో ఈరోజు పీసా దినోత్సవాన్ని సంబంధిత పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ గ్రామ పంచాయతీ సర్పంచ్ కళావతి, పంచాయతీ వార్డు సభ్యులు గ్రామస్తులు సహకారంతో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పీసా దినోత్సవానికి డివిజనల్ పంచాయతీ అధికారి బి రాంప్రసాద్, ఎంపీడీవో గీతాంజలి, సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ మధుసూదన్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకటేష్, హాజరు అయ్యి గ్రామస్తులకు పీసా చట్టంపై అవగాహన కల్పించడం జరిగినది అని తెలిపారు.

ప్రభుత్వ అవసరాలకు భూములు గుర్తించాలి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : ప్రభుత్వ అవసరాలకు భూములు గుర్తించాలని కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనేక వసతులు ఏర్పాటు చేయాల్సి ఉందని అందుకు భూమి అవసరం ఉందన్నారు. మండలాల్లో ప్రభుత్వ భూములను గుర్తించాలని ఆయన సూచించారు. వంద విద్యుత్ కనెక్షన్‌లు కంటే ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో సోలార్ పవర్ ఇచ్చుటకు అవసరమైన యూనిట్ ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించాలని ఆయన చెప్పారు. గ్రామ పంచాయతీ భవనాలు నిర్మాణానికి, ఫిష్ మార్కెట్ లు ఏర్పాటుకు, నగర వనాలు, పారిశ్రామికవాడలు ఏర్పాటుకు స్థలాలను గుర్తించాలని ఆయన ఆదేశించారు. ఫిష్ హెచరీస్ నిర్మానికి ఐదు హెక్టర్‌లు అవసరమని అందుకు అవసరమైన స్థలాన్ని కూడా గుర్తించాలని ఆయన ఆదేశించారు. రెవెన్యూ రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. అడంగల్ నిర్వహణ రెవెన్యూ వ్యవస్థకు మూలమని వాటి నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు. మ్యూటేషన్ జరిగే క్రమం పక్కాగా ఉండాలని సంబంధిత అనుసంధాన ఆధారాలు విధిగా రికార్డులలో లభ్యంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో అందిన అర్జీలను పూర్తిస్థాయిలో విచారణ చేసి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఇనాం భూముల సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అన్నారు. రెవిన్యూ సదస్సులు విజయవంతంగా నిర్వహించాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, తహసీల్దార్లు పాల్గొన్నారు.

అంతాడ సచివాలయంలో సజావుగా సాగిన రెవెన్యూ సదస్సు

ఆర్‌డీటీ పి.అప్పన్న

విశాలాంధ్ర-కొయ్యూరు : అంతాడ గ్రామ సచివాలయంలో ఆర్‌డిటీ అప్పన్న ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సులో వివిధ భూ సమస్యలపై 112 దరఖాస్తులు స్వీకరించినట్లు అప్పన్న తెలిపారు. వాటిలో మ్యుటేషన్-27, ఎఫ్ లైన్-9, ల్యాండ్ డిస్ప్యూట్-2, అసైన్మెంట్ డి పట్టా -23, వెబ్ లాండ్ అండ్ సర్వేనెంబర్ నమోదు-3, ఆర్వో ఎఫ్ ఆర్ -48 దరఖాస్తులు ఉన్నట్లు తెలిపారు. ఈ సదస్సులో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి 45 రోజులలో పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆర్డిటి అప్పన్న మాట్లాడుతూ ఈ కార్యక్రమం వచ్చే సంవత్సరం జనవరి 11 తేదివరకు ఈ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని, మండల ప్రజలంతా ఈ అవకాశం వినియోగించుకొని భూ సమస్యలు ఉంటే సదస్సులు జరిగే గ్రామ సచివాలయాలకు విధిగా వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వాయిదా పడిన పీసా ఎన్నికలు

విశాలాంధ్ర-వై.రామవరం : మండలంలో మంగళవారం నిర్వహించిన పి.ఎర్రగొండా, వై.రామవరం లలో పీసా కమిటి ఎన్నికలు వాయిదా కోరం లేక వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి హరి తెలిపారు. వీటిలో వై.రామవరంలో ఈనెల 28న ఎన్నిక ఉంటుందని తెలిపారు. అలాగే పీసా కమిటి దినోత్సవాలను పలుచోట్ల ఘనంగా జరిపారు. ఎంపీడీవో రవికిషోర్ పీసా చట్టం ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఈవోపిఆర్‌డి శివకుమార్, పంచాయితీ కార్యదర్శి లోవరాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలబంధ పీసా ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు దొర

విశాలాంధ్ర-గంగవరం : ఆమదాలబంధ పీసా ఉపాధ్యక్షుడిగా మాజీ సర్పంచ్ బిజెపి నాయకుడు కుంజం వెంకటేశ్వర్ల దొర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఆముదాల బంద సర్పంచ్ పాయం రాజులమ్మ అధ్యక్షతన జరిగిన దేశ గ్రామసభ లో మండల వ్యవసాయ అధికారి ఎన్నికల అధికారి కె విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఉపాధ్యక్షులు కార్యదర్శుల ఎన్నిక జరిగింది. గ్రామస్తులు అందరూ కలిసి వెంకటేశ్వర్లు దొరను, ఉపాధ్యక్షుడిగాను కార్యదర్శిగా చోడి ప్రదీప్ కుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి కృష్ణ స్వామి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీలో ఘనంగా పీసా చట్టం ఆవిర్భావ దినోత్సవాలు

- ప్రత్యేక గ్రామ సభల ద్వారా అవగాహన కార్యక్రమాలు
- ఎంపీపీ అనూష దేవి, జెడ్పీటీసీ బాలయ్య, సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు పుష్పలత, ఎంపీడీవో శ్రీనివాసరావు

విశాలాంధ్ర-చింతపల్లి : పీసా చట్టం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పిసా చట్టం అవగాహన కార్యక్రమాలు మండలంలోని వివిధ పంచాయతీలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్ని పంచాయతీలలో ఆ పంచాయతీల కార్యదర్శుల అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక గ్రామ సభలలో తాజంగి పంచాయతీలో ముఖ్యఅతిథిగా ఎంపీపీ కోరాబు అనూషదేవి, కొత్తపాలెం పంచాయతీలో ఎంఈఓ బోడం నాయుడు, కిటుముల గ్రామ పంచాయతీలో సర్పంచ్ గెమ్మేల రమణమ్మ, చింతపల్లి పంచాయతీ కందుల గాదే గ్రామంలో స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత, జడ్పిటిసి పోతురాజు బాలయ్య లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీలలో నిర్వహించిన పీసా కమిటీ సమావేశంలో గిరిజన ప్రాంతాల్లో పీసా చట్టంపై ప్రతి ఒక్కరూ (గిరిజనులు) అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పీసా చట్టం గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దోహద పడడమే గాక గిరిజనులకు రక్షణ కవచంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీలలో ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ సర్పంచ్ లు, పంచాయతీ తీర్మానం లేకుండా ఏ పని చేయటానికి అవకాశం ఉండదని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ ప్రత్యేక గ్రామసభలలో ఆయా పంచాయతీల సర్పంచ్ లు వంతల మహేశ్వరి, వనగల సోమరత్నం, గెమ్మేల రమణమ్మ, దురియా పుష్పలత, ఎన్డీఏ కూటమి పార్టీలకు చెందిన నాయకులు కిలో పూర్ణచంద్రరావు, ఆంద్రాబు లక్ష్మణ్, లక్కోజు నాగభూషణం, రీమల ఆనందరావు, వంతల బుజ్జిబాబు, ఆయా పంచాయతీల కార్యదర్శులు, పంచాయతీల వార్డు సభ్యులు, వైకాపా నాయకులు, కూటమి నాయకులు, సచివాలయం సిబ్బంది, ఉపాధి హామీ పథకం సిబ్బంది, రైతులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినియోగదారుల హక్కుల దినోత్సవం

విశాలాంధ్ర-చింతూరు : చింతూరులోని ప్రభుత్వ కళాశాలలో వినుయోగదారుల హక్కుల దినోత్సవం మంగళవారం జరిపారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి జి.హారతి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా అడ్వకేట్ యం.రవితేజ,వైస్ ప్రిన్సిపాల్ యం.శేఖర్ హాజరయ్యారు. యం.రవితేజ విధ్యార్ధినీ, విధ్యార్ధులను ఉద్దేశించి మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోరకు1986 డిసెంబర్ 24న వినియోగదారుల హక్కుల దినోత్సవంగా ప్రకటించారు. ఈచట్టాన్ని 2019 సంవత్సరంలో ప్రత్యేకంగా రివ్యూ చేసి వినియోగదారుడికి నష్టం జరిగితే జిల్లా ఫోరంలో ఫిర్యాదు చేయాలనీ నష్టం జరిగిన వినియోగదారుడుకి జిల్లా కలెక్టర్ ప్రధాన న్యాయాధికారిగా ఉండి నష్టపరిహారం సమకూర్చుతారని తెలిపారు. నష్టపోయిన వినియోగదారులకు ఐ.పి.సి. సెక్షన్ 27 ప్రకారం నష్టపరిహారం 45 రోజులలో అందచేస్తారనీ తెలిపారు. వినియోగదారులహక్కుల పరిరక్షణ కోసం 32చట్టాలు ఉంటాయని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ యం.శేఖర్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణ వలన వినియోగదారుడుకీ న్యాయం జరుగుతుందని తెలిపారు. వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి జి.హారతి మాట్లాడుతూ వినియోదారుల హక్కుల దినోత్సవంగా 1986 నుండి ఇప్పటివరకు వినుయోగదారుల హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో అడ్వకేట్ యం.రవితేజను విధ్యార్ధినీ, విధ్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జి.వెంకటరావు, ఆర్.సిహెచ్.నాగేశ్వరావు, యస్.అప్పనమ్మ, బి.శ్రీనివాస రావు, కె.శైలజ, డాక్టర్.వై.పద్మ, కె.శ్రీదేవి, కె.శకుంతల, కె.శ్రీలక్ష్మి, జి.సాయికుమార్, యన్.రమేష్ తదితర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విధ్యార్థిని, విధ్యార్థులు పాల్గొన్నారు.

పీసా కమిటీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ

విశాలాంధ్ర-పార్వతీపురం : స్థానిక ఐటీడీఏ పరిధిలోని గ్రామాల్లో పీసా (పంచాయతీరాజ్ ఎక్స్ టెన్షన్ షెడ్యూల్డ్ యాక్ట్) కమిటీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఐటీడీఏ కార్యాలయంలో ఎంపీడీఓలు, తహసీల్దార్లలతో పీసా కమిటీ ఎన్నికలపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని 278 పీసా గ్రామసభలకు ఉపాధ్యక్షులు, కార్యదర్శి పదవులకు 2025 జనవరి 2 నుంచి 6వరకు పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. పీసా గ్రామాలలో మరియు ఆవాసాలలో నివసిస్తున్న గిరిజనులకు, ఇతర ప్రజలందరికీ ఈనెల 24 నుంచి 31వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీఓలు, తహశీల్దారులు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పార్టీలకు అతీతంగా జరగబోయే ఈ ఎన్నికల్లో గిరిజనులు ఎవరైనా పోటీ చేయవచ్చని, ఈఎన్నికల ప్రక్రియలో పాల్గొనేలా గిరిజనులను ప్రోత్సహించాలని, గెలిచిన అభ్యర్థుల పదవీకాలంఐదేళ్లు ఉంటుందన్నారు. కావున ఈ ఎన్నికలపై 278 పెసా గ్రామాల్లో, ఆవాసాల్లో అవగాహన కల్పించుటకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని ఎన్నికలు జరగబోవు ప్రదేశం, ఎన్నికల తేదీ, సమయం తదితర వివరాలను గ్రామసభ సభ్యులందరికీ తెలియజేయాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామాలన్నింట్లో, గ్రామపంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో పోస్టర్లు అతికించాలని ఎంపీడీవోలు, తహశీల్దారులకు సూచించారు. గ్రామ గ్రామాన దండోరా వేయించడం, మీడియా ద్వారా ప్రచారం, కరపత్రాల పంపిణీ మొదలగు మార్గాల ద్వారా గిరిజన ప్రజలందరికీ అవగాహన కల్పించి, పీసా ఎన్నికలు విజయవంతం అయ్యేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయక ప్రాజెక్టు అధికారి పి.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

పీసా గ్రామ కమిటీ సభలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-రంపచోడవరం : ఏజెన్సీలోని పీసా గ్రామ కమిటీ సభలు గిరిజనులు అంత కలిసికట్టుగా ఉపయోగించుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. మంగళవారం గంగవరం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో ఏర్పాటుచేసిన పీసా కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శు ఎన్నికకు ప్రాజెక్ట్ అధికారి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీలో ప్రతి గ్రామంలో గిరిజనులందరూ కలిసికట్టుగా పీసా కమిటీ గ్రామ సభలలో పాల్గొని మీ మీ గ్రామాలకు సంబంధించిన తీర్మానాలు చేసుకొని సమర్పించిన ఎడల వివిధ రకాలైన అభివృద్ధి పనులు మంజూరు చేయవచ్చని ఆయన తెలిపారు. పీసా కమిటీ గ్రామ సభలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమలుచేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. పిసా గ్రామసభలు ఎప్పుడు జరిగిన మీ మీ గ్రామాలలో గిరిజనులందరూ తప్పకుండా పాల్గొవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి జి. రామకృష్ణ, సర్పంచ్ కె. అక్కమ్మ, మాజీ ఎంపీపీ తీగల ప్రభ అదేవిధంగా గ్రామానికి చెందిన గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

చిడుమూరు గ్రామ పంచాయితీలో రెవిన్యూ సదస్సు

విశాలాంధ్ర-చింతూరు : చీడుమురు గ్రామ పంచాయతీకి చెందిన బురక్కనకోట, కన్నాపురం, నరసింహపురం గ్రామములలో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ గ్రామ సభకు చీడుమురు గ్రామ సర్పంచ్, శ్రీమతి కాక అరుణ కుమారి, తహసీల్దార్ యస్. చిరంజీవి బాబు, ఆర్.ఐ విగ్నేష్, గ్రామ రెవిన్యూ అధికారులు కారం దారయ్య గ్రామ సర్వేయర్లు అనిగి సాగర్ బాబు, పారెస్టు డిపార్టెంట్ ఎఫ్ఎస్ఓ, టి.సాయి వెంకట రమణ, పోలవరం ప్రాజెక్టు భూసేకరణ కార్యాలయ, చింతూరు సిబ్బంది డిఈఓస్. డి.ఉదయ్, యస్.మంగతాయారు, మెడికల్ డిపార్టెంట్ కిషోర్ కుమార్ ఒప్తలమిక్ ఆఫీసర్, ఆశ వర్కర్ సిబ్బంది గ్రామ సభలకు హాజరు అయ్యినారు. ఇందులో భూమి సంబంధిత సమస్యల అనగా, ఆన్లైన్ నమోదు కొరకు, పట్టా మార్పుల కొరకు, అసైన్ మెంట్ పట్టాలు కొరకు, భూమి సర్వే కొరకు, విస్తీర్ణం తప్పులు, కొత్తగా పాస్ పుస్తకం కొరకు ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు కొరకు దరఖాస్తులు తీసుకోవటం జరిగినది, రెవిన్యూ దరఖాస్తులు. 21 స్వీకరించారు. మెడికల్ సంబంధించి 38 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

దోమ తెరలు జ్వరాలకు దూరంగా ఉండాలి : అలెర్ట్ కో-ఆర్డినేటర్

విశాలాంధ్ర-చింతూరు : దోమతెరల వాడి జ్వరాలకు దూరంగా ఉండాలని అలర్ట్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ ఏ.వి.సత్యనారాయణ గిరిజనులకు పిలుపునిచ్చారు. చింతూరు, వి.ఆర్.పురం మండలంలోని, రామవరం, కోప్పల్లి తదితర మారుమూల గిరిజన గ్రామాల్లో 3 వేల దోమతెరలు 510 మందికి పంపిణీ చేశారు. పంపిణీ అనంతరం దోమతేరలు వాడే విధానాన్ని తెలియజేశారు. చింతూరు మండలం లోని కొండపల్లి, చిన్న సీతనపల్లి, రామన్నపాలెం, తులసిపాక గ్రామాల్లో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అలెర్ట్ సంస్థ కోఆర్డినేటర్ ఎవి సత్యనారాయణ, ఆర్గనైజర్ పండా కల్యాణి, రంగమ్మ, సాయి కృష్ణ, చింతూరు మండల తెలుగుదేశం అధ్యక్షులు ఇల్లా చిన్నారెడ్డి, సర్పంచ్ పూసం వెంకట లక్ష్మి, అసిఫ్, గడ్డం, సురేష్, జనసేన మండల అధ్యక్షులు మడివి రాజు, ఉపాధ్యక్షులు తీగల రవిప్రసాద్, సతీష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవో ఆధ్వర్యంలో పీసా దినోత్సవం

విశాలాంధ్ర-చింతూరు : ముకునూరు గ్రామపంచాయతీ లో పేసా చట్టం అమలులోకి వచ్చిన రోజు సందర్భంగా మంగళవారం ఐటీడీఏ పిఓ అపూర్వ భరత్ ఆధ్వర్యంలో పేసా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆదివాసీ ఉద్యమ స్వాతంత్ర సమరయోధులు అయినా బిర్సా ముండా గారు జయంతి (జన జయంతి గౌరవ దివాస్) సందర్భంగా గ్రామపంచాయతీ సర్పంచ్ బీరబోయిన సత్యకుమారి, ఎంపీపీ అమల హాజరై బిర్సా ముండాకు నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ సత్యకుమారి అధ్యక్షతన గ్రామపంచాయతీ వద్ద పేసా సెలెబ్రేషన్స్ కార్యక్రమం జరిగింది. ఈ గ్రామసభలో పేసా గ్రామ కమిటీకి కొత్తగా ఎన్నిక అయిన పేసా గ్రామ ఉపాధ్యక్షులు, గ్రామ కార్యదర్శులు, యం.పి.పి. అమల ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యం.డి.ఓ. చైతన్య కళ్యాణ్ జై భరత్ దేవ్, పంచాయతీ సెక్రటరీ మాగంటి సురేష్, రమేష్, ముకునూరు సచివాలయం సిబ్బంది, ఆశ, అంగన్వాడీ, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పోరాటానికి బిఎస్పీ పార్టీ మద్దతు

విశాలాంధ్ర-బెలగాం : గిరిజన గురుకుల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పోరాటానికి బహుజన సమాజ్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. బుధవారం దీక్ష శిభిరం వద్దకు రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబు, జిల్లా అధ్యక్షులు తాడంగి మిన్నారావు, కార్యదర్శి పాలక సుదీర్ వచ్చి మాట్లాడుతూ సమస్య పరిష్కారం కోసం తమ పార్టీ ద్వారా ప్రయత్నం చేస్తామని తెలిపారు.

ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల మానవహారం

విశాలాంధ్ర-బెలగాం : గిరిజన గురుకులాల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు బుధవారం పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద 'మానవహారం' నిర్వహించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం ఇవ్వాలని, ప్రతిపాధిత "డిఎస్సీ" నుండి తమ పోస్టులు మినహాయించాలని డిమాండ్ చేసారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళిమోహన్, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్‌కుమార్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ జెఎసి జిల్లా కన్వీనర్ బివి రమణ, ఎస్ఎస్ఐ జిల్లా కమిటీ సభ్యులు డేవిడ్, రాజు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావులు మాట్లాడుతూ గిరిజన గురుకుల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పోరాటంలో భాగస్వామ్యం అవుతామని, పోరాటం ఉధృతం చేయాలన్నారు. గత 15-20 సంవత్సరాలనుండి పనిచేస్తున్న వారిని రోడ్డున పడేయడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. తల్లితండ్రులు, విద్యార్థులు, ప్రజా సంఘాలతో కలసి జిల్లా కలెక్టర్ కార్యాలయం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఇల్లు ముట్టడికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘ నాయకులు దివాకర్, కామేష్, రాజేష్, జ్యోతి, ఉమా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీసా చట్టం కమిటీ సభ్యుల ఎన్నిక

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామ జిల్లా మండల కేంద్రం రేఖపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రేఖపల్లి నందు సర్పంచ్ పూనెం సరోజినీ అధ్యక్షతన ఎన్నికల అధికారి ఎంఈఓ వి.వి.లక్ష్మీనారాయణ, గ్రామపంచాయతీ సెక్రటరీ శివప్రసాద్ సమక్షంలో మంగళవారం ప్రతిష్టాత్మకంగా జరిగినటువంటి పిసా కమిటీ గ్రామసభలో సిపిఎం పార్టీ అభ్యర్థులైన సారా పాండురాజు. ఉపాధ్యక్షులుగా, వేటగాని సూరిబాబు కార్యదర్శిగా, అలాగే ఉమ్మడివరం గ్రామం నుండి ఉపాధ్యక్షుడిగా పాయిం సుబ్బారావు, కార్యదర్శి సోయం జోగారావు ఎన్నికయ్యారు. ఈగ్రామ సభకు, వివిధ పార్టీలకు సంబంధించినటువంటి పెద్దలు, పుర ప్రముఖులు, గ్రామ పెద్దలు ,గ్రామస్తులు, భారీ ఎత్తున హాజరై గ్రామ సభను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల పార్టీ కార్యదర్శి పులి. సంతోష్, మండల నాయకులు పంకు.సత్తిబాబు, చిన్నమట్టపల్లి యం.పి.టి.సి పూనెం.ప్రదీప్ కుమార్, శీరపు తాతబాబు, పోడియంశ్రీరామ్మూర్తి,నాళ్ళరపు ప్రకాష్‌రావు, సీనియర్ నాయకులు పంకు శ్రీరామ్మూర్తి, వీర్ల నాగేశ్వరావు, నాల్లరపు చింటు, బీరబోయిన గౌతమ్, కల్లి రవి, బాబీ, తదితరులుపాల్గొన్నారు.

డిసెంబర్-26 నుండి జరగబోయే ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగులు వాయిదా వేయాలి

ఎపిటిఎఫ్ 1938 జిల్లా ప్రధాన కార్యదర్శి కూర్మినాయుడు

విశాలాంధ్ర-బెలగాం : మానవ వనరుల శాఖామాత్యులు నారా లోకేష్ తో గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలు మరియు అధికారులతో ఈనెల 13వ తేదీన సమావేశం జరిగిందని పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు వి. ధనంజయ నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు పి. మధు,జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరమణ తెలిపారు. ఈ సమావేశ%శీ%లో రాష్ట్ర నాయకులు చేసిన ప్రాతినిధ్యం మేరకు 10వ తరగతి విద్యార్థులకు వందరోజుల ప్రణాళికలో భాగంగా రెండవ శనివారాలు, ఆదివారాలు, పండుగ సెలవు దినాలలో పాఠశాలకు వచ్చే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వసతి ఉండదని, దూర ప్రాంతాల నుండి వచ్చే బాలికలకు రక్షణ వుండదని వాటిని సెలవు దినాలుగా ప్రకటించాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖ ఎడి కి ఎపిటిఎఫ్-1938 జిల్లా ప్రధాన కార్యదర్శి పి. కూర్మినాయుడు ప్రాతినిధ్యం చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా డిసెంబర్ 26వ తేదీ నుంచి చేపట్టబోయే ఎఫ్ఎల్ఎన్ ట్రెనింగ్ లకు సంబంధించి 22 నుండి 29 వరకు క్రిస్టియన్ మైనారిటీ పాఠశాలలకు క్రిస్మస్ పండుగ సెలవులు ఉన్నందున, 26వ తేదీ నుండి జరుగబోయే ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగులు వాయిదా వేసి 2025 జనవరి నెలలో నిర్వహించాలని ఎపిటిఎఫ్-1938 పార్వతీపురం మన్యం జిల్లా శాఖ పక్షాన ఎడికి లిఖితపూర్వకంగా ప్రాతినిధ్యం చేయడం జరిగిందని తెలిపారు.

జాతీయ పీసా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో- పాడేరు : జాతీయ పీసా దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని పీసా వర్తించే గ్రామా పంచాయతీలలో పీసా దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా పాడేరు గ్రామా పంచాయతీలో శ్రీ మోదకొండమ్మ ఆలయం ఆడిటోరియంలో సర్పంచ్ కె.ఉషారాణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమమునకు ముఖ్య అతిదిగా జిల్లా కలక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కలక్టరు మాట్లాడుతూ ప్రస్తుతము ప్రభుత్వం పీసా వర్తించే గ్రామాలకు కమిటీలను తయారుచేసి వచ్చే నెల జనవరి 3 నుండి 7వరకు గ్రామసభలు ద్వారా పీసా ఎన్నికలు జరిపి వైస్ ప్రెసిడెంట్, సెక్రెటరీ ఎన్నుకోబడునని తెలిపారు. పీసా యాక్ట్ ద్వారా ప్రత్యేకంగా ఆదివాసి గ్రామాలకు గ్రామ సభలకు ప్రత్యేక అధికారాలు సంక్రమిస్తాయని, ఈ అధికారాలను స్థానిక గిరిజనులు వారి గ్రామాభివృద్ధికి సవ్యంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరి గ్రామస్తులుచేత మత్తుపదార్థరహిత గ్రామంగా పాడేరును తీర్చిదిద్దాలని అందరిచేత ప్రమాణం చేయించారు. ఈకార్యక్రమంలో జిల్లా పంచాయితి అధికారి బి.లోవరాజు, మండల అభివృద్ధి అధికారి ఎస్.డేవిడ్ రాజు, ఐ.ఆర్ డి ఆర్.వి.ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నరసింహమూర్తి మాస్టారు జ్ఞాపకార్థం వితరణ

విశాలాంధ్ర-కూనవరం : మద్రి నరసింహమూర్తి మాస్టారు ఇటీవల కాలంచేశారు. నాలుగు దశాబ్దాల పాటు ఉపాధ్యాయునిగా వేలాదిమంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఆయన జ్ఞాపకార్థం వారి కుమార్తె ఝాన్సీ విజయసాధన పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు కంబాక్సులు పెన్నులు పెన్సిళ్లు నోటు పుస్తకాలు వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో మాస్టారు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఐతమ్‌లో జాతీయ స్థాయి ఆవిష్కార్ హేకథాన్ పోటీలు

విశాలాంధ్ర-టెక్కలి: సమాజంలో ఉన్న పలు సమస్యలను గుర్తించి వాటికి సాంకేతిక పరిష్కారాలను కనుగొనుటకు దేశవ్యాప్తంగా ఆసక్తిగల ఇంజినీరింగ్ విద్యార్థులు ఒక చోట చేరి 48 గంటల పాటు నిర్విరామంగా కృషి చేయుటకు రెండవ సారి ఐతమ్ కళాశాల వేదిక కానుంది. ఈ మేరకు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు. టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 28,29,30 తేదీల్లో జాతీయ స్థాయి ఆవిష్కార్ (48 గంటల) హేకథాన్ పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇదే పోటీలను గడచిన ఫిబ్రవరిలో నిర్వహించగా సీజన్-2 కింద రెండవ విడతగా ఈ నెలాఖరులో నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఐఐటి, ఎన్ఐటి, డీమ్డ్ యూనివర్సిటీలు ఇతర ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలల నుండి దేశ వ్యాప్తంగా 18 రాష్ట్రాలకు చెందిన 1500 బృందాలు తమ పేర్లను నమోదు చేసుకోగా,వాటిని ఆన్లైన్ ద్వారా 5 రౌండ్లలో పరిశీలించి చివరగా 70 బృందాలను ఎంపిక చేశామన్నారు. ఈ బృందాలు డిజిటల్ ఎంపవర్మెంట్ ఫర్ రూరల్ కమ్యూనిటీ, అర్బన్ మొబిలిటీ అండ్ ట్రాఫిక్ మేనేజ్మెంట్, అగ్రికల్చర్, ఫుడ్ టెక్నాలజీస్, మెడికల్ అండ్ హెల్త్, వేస్ట్ మేనేజ్మెంట్ అండ్ రీసైక్లింగ్, ట్రావెల్ అండ్ టూరిజం, రెన్యుబుల్ ఎనర్జీ సొల్యూషన్స్, స్టూడెంట్ ఇన్నోవేషన్ వంటి అంశాల్లో ప్రజలకున్న సమస్యలను గుర్తించి వాటికి సాంకేతిక పరిష్కారాలు చూపుతూ 48 గంటల పాటు (రాత్రి పగలు) వారి వారి ప్రాజెక్టులపై (ఆలోచనలు) పనిచేస్తారన్నారు. వీరు పరిష్కరించిన మూడు ఉత్తమ సమస్యలను గుర్తించి మొదటి బహుమతి కింద రూ.1.25 లక్షలు, రెండవ బహుమతిగా రూ.లక్ష, మూడవ బహుమతిగా రూ.75 వేలు చొప్పున నగదు బహుమతులను అందజేస్తామని డైరెక్టర్ నాగేశ్వశ్వరరావు పేర్కొన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా వాలివాన్ టెక్నాలజీస్ నుండి సందీప్ బత్తుల వ్యవహరిస్తారన్నారు. బహుమతుల అందజేతకు ముఖ్య అతిథిగా గీక్సుర్ఫ్ వ్యవస్థాపక సిఈఓ సందీప్ జైన్ హాజరవుతారని డైరెక్టర్ తెలిపారు. ఈ ఆవిష్కార్ 48గంటల హేకథాన్ క్కు గీక్సుర్ఫ్, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫాక్స్, సిసిసి, న్యూలిప్, ఎసెన్టిసి, మేట్రిక్‌ఎగ్స్ కంప్యూటర్స్-విజయవాడలుసౌజన్యంతో నిర్వహిస్తున్నట్టు డైరెక్టర్ ప్రొఫెసర్ నాగేశ్వర రావు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్. శ్రీనివాసరావు, కన్వీనర్ డాక్టర్ జి.సతీష్ కుమార్, స్పాన్సర్ షిప్ లీడ్గా డాక్టర్ ఎం.వి.ఎన్.ఎస్. సంతోష్ కుమార్, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ జె.సురుష్ కుమార్, గిరీష్ కుమార్, స్టూడెంట్ కన్వీనర్ సాయి శ్రీనివాస్, కో-కన్వీనర్గా ఎస్.శ్రావ్యలు వ్యవహరిస్తున్నట్టు ఆయన వెల్లడించారు.

దారకొండ సచివాలయంలో పీసా దినోత్సవ గ్రామ సభ

విశాలాంధ్ర-సీలేరు : జీకేవీధి మండలం దారకొండ సచివాలయంలో పంచాయితీ కార్యదర్శి సిహెచ్.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో పీసా దినోత్సవం సందర్భంగా గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులు ప్రధానంగా జనజీవన స్రవంతికి దూరంగా ప్రశాంతంగా జీవనం కొనసాగిస్తున్నారని గిరిజన ఆచార వ్యవహారాలు సంస్కృతి సాంప్రదాయాలు ప్రత్యేకంగా ఉంటాయని, అటవీ ప్రాంతంలో నివసించే గిరిజనులకు అడవులతో అవినాభావ సంబంధాలు ఉంటాయన్నారు. వారి జీవనోపాధికై ప్రధానంగా అడవిపై ఆధారపడతారని గిరిజనులు తమ అమాయకత్వం వల్ల అరాచకాలకు దోపిడీకి గురవుతున్నారన్నారు. మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన వారు గిరిజనులకు అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చి గిరిజనులను దోచుకుంటున్నారన్నారు. వారి నిస్సహాయతను అదునుగా చూసుకొని వారి భూములను స్వాధీనం చేసుకుంటున్నారని షెడ్యూల్ ప్రాంతాల అభివృద్ధి పునరావాసము భూసేకరణ సమయంలో గిరిజనులకు అవగాహన లేకపోవడం వారి అభిప్రాయాలను తెలియజేయడానికి సరైనటువంటి వేదిక లేకపోవడం వలన గిరిజనులు విపరీతంగా నష్టపోతున్నారని పీసా చట్టం అటవీ హక్కుల చట్టం మదకశిర ద్రవ్యాల నిరోదించడం వంటి వాటిపై గిరిజనులకు అవగాహన కలిగించారు. అఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి మాడి రామన్న, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుదు సభ్యులు సుంకరి విష్ణుమూర్తి, వీఆర్వో ముర్ల సత్యనారాయణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాంబాబు మహిళ పోలీస్ పి.పద్మ డిఏ.రాము, కూటమి సభ్యులు శోభ జగన్ పోతురాజు, గోవిందరాజు శెట్టి, వెంకటేష్, తగ్గి బంగారు దొర, పొత్తూరు, రాంబాబు, నడిగొట్ల నాగభూషణం, సచివాలయం సిబ్బంది స్థానిక గిరిజనులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ కమిటీ మెంబర్‌గా తోట రాము

విశాలాంధ్ర-ఆమదాలవలస: జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గల, ఎస్సీ ఎస్టీ సాధారణ మోనిటరింగ్ కమిటీ, మెంబ ర్ గా చింతాడ కు చెందిన తోట రాములు ను ప్రభుత్వం నియ మించింది. ఈ మేరకు మంగ ళవారం జిల్లా కలెక్టర్ వారు తనకు ఉత్తర్వులు కాపీ అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్ గాను, జిల్లా పోలీస్ సూపరిం డెంట్ జిల్లా ఎం.పీ, ఎమ్మె ల్సీ శాసనసభ్యులు కీలక ప్రతినిధులు గాను, రాములతో పాటు మరో ఐదుగురు సభ్యులు ఉంటారని తెలిపారు. రాములు తెలుగుదేశం పార్టీ తరఫున ఆముదాలవలస మున్సిపల్ ఎన్నికలలో రెండుసార్లు పోటీలో తలపడ్డారు. టిడిపి పార్టీకి రవికుమార్ కు విధేయుడుగా ఉన్న రామును కమిటీ సభ్యునిగా ఎన్నుకోవడంపై అభినందనలు తెలిపారు. తన నియామకం పట్ల జిల్లా కలెక్టర్ వారికి, స్థానిక శాసనసభ్యులకు, డిప్యూటీ డైరెక్టర్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.